క్లుప్తంగా

ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరావు



వినుకొండ(నూజెండ్ల): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐగా దేవర శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన అబ్దుల్ జలీల్ నెల్లూరు జిల్లా కనిగిరికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావును స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన విద్యుత్ ఏడీఈ



వినుకొండ(నూజెండ్ల): సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రేపల్లె నుంచి వినుకొండకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన కిరణ్‌బాబు గుడివాడ రూరల్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఏడీఈ శ్రీనివాసరావును కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించండి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సరోజినీ దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. పశువులకు గడ్డికొరత, ఇతర వైద్య సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలాజీ, రామయ్య, చిన్నఖాశీం, ఖలీల్, నాసరమ్మ, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

చందోలు నాగవాణికి డాక్టరేట్ ప్రదానం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణికి వైద్య, విద్య, సామాజిక సేవా రంగాల్లో చేసిన సేవలకు గాను గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. విజయవాడలో జరిగిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో 129వ గుర్రం జాషువా జయంతి వేడుకల్లో చందోలు నాగవాణి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వృత్తి రీత్యా ప్రభుత్వ నర్స్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. డాక్టరేట్ పొందిన నాగవాణిని పలువురు అభినందించారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీచేయనున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. 9532 మందికి గాను రూ.4,01,56,500లు సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: గుంటూరు జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన జిల్లా జూనియర్ బాల్‌బాడ్మింటన్ ఎంపిక పోటీలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి సోమవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని బండారు శరణ్య, 9వ తరగతి విద్యార్థి షేక్ ఆరీఫ్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అక్టోబర్ 5 నుంచి విశాఖ జిల్లా నునపర్తి మండలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ఇద్దరు విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జి.రఘునీస్రాణి, షేక్.పాతిమా, పి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వివక్షకు తావులేకుండా పనులు చేపడతాం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: వివక్షకు తావులేకుండా అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో సోమవారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని, ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వాదనకు దిగారు. ఈ విషయమై చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి వార్డు పరిధిలో రూ. 40లక్షల అభివృద్ధి జరిగిందని, ఇంకా విలీన గ్రామాలతో సహా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్, శానిటరీ సిబ్బందితో ఆయా వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేస్తామన్నారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ కళామందిర్ సెంటర్‌లో ఉన్న మున్సిపల్ షాపుల అద్దెలు వసూలు చేయడం లేదని అందువల్ల పురపాలక సంఘం ఆదాయం కోల్పోతున్నదని విమర్శించారు. దీనికి తోడు పట్టణంలో సుమారు ఆరు వేల అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయని వాటిని క్రమబద్ధీకరిస్తే పురపాలక సంఘానికి ఆదాయం పెరుగుతుందని ఈ విషయం ఎన్నిసార్లు ప్రస్తావించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పట్టణంలో ఆక్రమణల తొలగింపు ఒక్క కేబీ రోడ్డుకే పరిమితమా? మిగిలిన ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కొంత మంది మున్సిపల్ ఉద్యోగులు లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వీటిపై దృష్టి సారించాలని కోరారు. ఈ విషయాలపై తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు సమాధానం ఇచ్చారు. 12 వార్డు కౌన్సిలర్ యడ్ల ఇందిరా మాట్లాడుతూ తన వార్డు పరిధిలో అభివృద్ధి మాట పక్కన పెడితే కనీసం వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి ఉందని విమర్శించారు. 11 వార్డు కౌన్సిలర్ మానుకొండ మాధవి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో కోతుల బెడద అధికంగా ఉందని వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. పలువార్డుల కౌన్సిలర్లు పట్టణంలో కుక్కల బెడద నివారించాలని కోరారు. దీనికి కమిషనర్ సమాధానం చెబుతూ కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కుక్కలకు సంతాన నిరోధ ఆపరేషన్లు నిర్వహించేందుకు పశువైద్యులను సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు.



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విద్యార్థులకు లా కళాశాల ప్రతినిధులు సూచన

చిలకలూరిపేటటౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని లా కళాశాలకు చెందిన ప్రతినిధులు చెప్పారు. గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి కాలేజ్ ఆఫ్ లా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిలకలూరిపేట పట్టణంలోని నిఖిల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. లా కళాశాలకు చెందిన ప్రతినిధులు హాజరై నూతన చట్టాలు, గృహహింస, బాలికలపై జరిగే అత్యాచారాలు, సైబర్ క్రైం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. కార్యక్రమంలో జాగర్లమూడి చంద్రమౌళీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపల్ చిట్టినేని సుధాకర్ బాబు, ప్రతినిధులు త్రిపురం సురేంద్రప్రసాద్ (నాని), కె పుల్లారావు, సయ్యద్ షుక్రియ, రోష్ని, లహరి, గీతిక, లీలాపవన్, రామకృష్ణ, శ్రీకాంత్, దేవకుమార్, హరి, ప్రకాష్, సింధు, విజయ్, నిఖిల డిగ్రీ కళాశాల అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి బొంతా భగత్‌సింగ్, చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి ఎం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం సాయినాయక్, గోపి, సాహిత్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

జాతీయ ఫెస్ట్‌లో నరసరావుపేట విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కైట్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫెస్ట్‌లో కళాశాల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షేక్ జాస్మిన్, వి.కవిత, పి.అఖిల్, ఎస్.రాకేష్లు పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నూతన సాంకేతికత, బిజినెస్ మార్కెట్‌కి సంబంధించిన విధానాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని తెలిపారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.పట్టాభిరామ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

వీపీఏలను వ్యవసాయ శాఖలో విలీనం చేయాలి

నరసరావుపేట రూరల్: వీపీఏలను పంచాయతీ రాజ్ శాఖ నుంచి మాతృశాఖ వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని వీపీఏ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీని కోరారు. ఈ మేరకు సోమవారం లింగంగుంట్లలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖరీఫ్-24లో ఈ-పంట నమోదు, రైతుల ఈకైవేసి చివరితేదీని ఈనెల 15వ తేదీ వరకు పొడిగించాలని తెలిపారు. ఇతర శాఖాపరమైన పనుల నుంచి వ్యవసాయ సహాయకులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి. వెంకటరాజు, ప్రధానకార్యదర్శి జి.ఫిలిప్, కార్యదర్శులు ఎం.బోస్, ఏ.ఇర్మియా, పి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వ్యవసాయ అధికారి మురళికి వినతి పత్రం అందజేస్తున్న వీపీఏ అసోసియేషన్ ప్రతినిధులు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

పిడుగురాళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనులు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు విజయవాడ వరదల సందర్భంగా పని చేసిన వారికి ఒక నెల జీతం అదనంగా ఇవ్వాలని, దుస్తులతోపాటు కుట్టుకూలి ఇవ్వాలని, చనిపోయిన కార్మికులకు వెంటనే పరిహారం చెల్లించాలని, వారి స్థానంలో ఆ ఇంట్లో వారికే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ్యులు, నూనెలు, యూనిఫాం, చెప్పులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు అంగడి శ్రీనివాసరావు, ధీకొండ వెంకటేశ్వర్లు, శాం కోటి, కృష్ణవేణి, చల్లా పద్మా, అనూషా, అని, పరమేశ్వరరావు, గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా

పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

కారెంపూడి: స్వచ్ఛతా హీ పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని క్లాప్ మిత్రాలకు పంచాయతీ కార్మికులు వారి కుటుంబాలకు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులు క్లాప్ మిత్రాలకు పీహెచ్‌సీ డాక్టర్ రమ్య వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలను గుర్తించి మందులు రాశారు. ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముందుగా పంచాయతీ కార్మికులు, క్లాప్ మిత్రాలు తగిన రక్షణ చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. తమకు జీతాలిప్పించాలని క్లాప్ మిత్రాలు కోరగా వెంటనే జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రమ్య

రేపు సత్యాగ్రహ దీక్ష

నరసరావుపేట: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటంలో భాగంగా ఈనెల రెండో తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ మున్సిపల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ.కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావులు చెప్పారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

ముగిసిన పౌష్టికాహార వారోత్సవాలు



రొంపిచర్ల: మండలంలోని రామిరెడ్డిపాలెం, కొత్తపల్లి, రొంపిచర్ల గ్రామాల్లో పౌష్టికాహార ముగింపు కార్యక్రమాలు సోమవారం ముగించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పాఠశాలల్లో చేతులు శుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి హవీలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీనాతో పాటు విప్పర్ల, రొంపిచర్ల, మునుమాక సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి పంపిణీ



బొల్లాపల్లి: మండలంలోని మూగచింతల పాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అరుంధతి సేవా సంఘం తరఫున ప్లేట్లు, గ్లాసులు, కుర్చీలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సేవా సంఘం 14 సంవత్సరాల నుంచి అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తుందని, భవిష్యత్‌లో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రావూరి నారాయణ, బోడపాటి యలమంద, గర్నెపూడి ఈశ్వరయ్య, గుంజరి పున్నయ్య, కట్టెంపూడి బర్న, శిఖా రామయ్య, శిఖా కోటేశ్వరరావు, స్వర్ణ నాగయ్య, గుద్దటి వెంకట కోటయ్య, దూపాటి బాబు, పత్తిపాటి పవన్, శిఖా మరియబాబు, గుంజరి నాసరబాబు, కడియం మరియబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛతా పక్వాడ స్వచ్ఛతా హి సేవ



స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం గ్రామంలో గల ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో సోమవారం ''స్వచ్ఛతా పక్వాడ'' ''స్వచ్ఛతా హి సేవ'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాఠశాలలో చేసిన శ్రమను అభినందించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించి శుభ్రపరిచారు. మొక్కలు ఎదుగుదలకు పాదులను చేసి నీరు అందించారు.

ప్రొడక్ట్ డిజైనింగ్, డ్రాఫ్టింగ్‌పై వర్క్‌షాప్

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వారం రోజులు నిర్వహించనున్న వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అకడమిక్ క్యాలండర్‌లో భాగంగా ప్రొడక్ట్ డిజైనింగ్ అండ్ డ్రాఫ్టింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ ట్రైనింగ్ కోర్సుకు 64 మంది విద్యార్థులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వర్క్‌షాప్ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఐ.ఫణిసుష్మ, కోఆర్డినేటర్ డాక్టర్ డి.సులోచన, స్టూడెంట్ కోఆర్డినేటర్ బాల పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు

ఉప్పరపాలెం నిరుపేదలకు గృహాలు నిర్మించాలి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామంలో నివసిస్తున్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ కోరారు. సోమవారం ఉప్పరపాలెం గ్రామస్తులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో ఇచ్చిన స్థలాల్లోనే నేటి వరకు తాటాకుల పూరి ఇళ్లలోనే ఉంటున్నారని, అప్పటి నుంచి కుటుంబాలు విస్తరించడంతో చాలీచాలని స్థలంలో నివాసం ఉండలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలంటూ తహసీల్దార్ సురేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, చీరాల అంజయ్య, తిరుమల దుర్గమ్మ, రూతమ్మ, రాహేలమ్మ, ఈశ్వరమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వార్డు పరిసరాల శుభ్రత సెక్రటరీలదే

- ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించండి
- వార్డు సెక్రటరీలకు సూచించిన కమిషనరు

నరసరావుపేట: ప్రతి సెక్రటరీ తమ వార్డు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు ఎం.జస్వంతరావు కోరారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ అతిథి గృహంలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో మాట్లాడారు. శానిటేషన్‌పై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, తమ యొక్క వార్డు పరిధిలో ఉండేటటువంటి అన్ని వ్యాపార సంస్థల వారికి తడి,పొడి చెత్త వేరువేరుగా పురపాలక సంఘ సిబ్బందికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మీ పనితీరు మీ వార్డు పరిసరాల పరిశుభ్రతపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. పట్టణ వ్యాపారస్తులందరూ తమ షాపులలో వచ్చేటటువంటి చెత్తను తడి, పొడి చెత్తగా వేరు వేరు చేసి పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసినటువంటి ట్రాక్టర్స్‌కు అందించాలని సూచించారు. అదేవిధంగా రోడ్లమీద అమ్ముకునేటటువంటి పండ్ల బండ్లు, కూరగాయల బండ్లు, బడ్డీకొట్లు, టీ షాప్‌ల వ్యాపారులు తమ వద్ద వచ్చేటటువంటిని చెత్తను వేయుటకు 20 లీటర్ల బిన్లను ఏర్పాటు చేసుకొని పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లకు అందించగలరని సూచించారు.

ఆ విధంగా లేనిచో వారికి జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. వ్యాపారస్తులు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పూర్తిగా ప్లాస్టిక్ నిషేధించటమైందని, 120 మైక్రాన్లు గల ప్లాస్టిక్‌ని మాత్రమే వినియోగించుకోవాలని, లేకుంటే సదరు వ్యాపారస్తులపై జరిమానా విధించడం జరుగుతుందని, కావున ప్రతి ఒక్కరూ పట్టణ ప్రజలు, వ్యాపార సంస్థల వారు స్వచ్ఛ నరసరావుపేట కోసం పురపాలక సంఘం వారికి సహకరించాలని కోరారు. శానిటేషన్ ఇనస్పెక్టర్లు రామకోటయ్య, రమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సొసైటీ రుణాలు సకాలంలో చెల్లించాలి

జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాసరావు

నాదెండ్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు, సభ్యులు వాయిదాలను సకాలంలో చెల్లించి సంఘ పురోభివృద్ధికి సహకరించాలని జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. యడ్లపాడు సొసైటీలో సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రూ.45 కోట్లు రుణాలు మంజూరు చేసినందున గడువు దాటి వసూలు కాని రుణ వాయిదాల మొత్తం రూ.5 కోట్లకు పైగా ఉందన్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చిలకలూరిపేట జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ సభ్యులు భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో పర్సన్ ఇన్‌చార్జి పీబీబీ మాట్లాడుతూ సొసైటీలో రూ.300 షేరు ధనం కలిగిన పూర్వసభ్యులు ఆధార్, పాన్, ఫోటో, ఫోన్‌నెంబరు అందిస్తే డిజిటల్ చేసి ఓటు హక్కు పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో జి.శ్రీనివాసరావు, సభ్యులు ఉన్నారు.



యడ్లపాడులో సొసైటీ సభ్యులతో మాట్లాడుతున్న ఆడిట్ అధికారి శ్రీనివాసరావు

బాస్కెట్‌బాల్ రాష్ట్రజట్టుకు ఇరువురు ఎంపిక

నాదెండ్ల: యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి తొమ్మిదో తరగతి చదువుతున్న వై.నాగవైష్ణవి అండర్ 17 విభాగానికి, మరో విద్యార్థిని బి హంసిక అండర్ 14 విభాగానికి ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 17, 18, 19 తేదిల్లో అండర్ 17 విభాగంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరగనున్నాయి. అక్టోబర్ చివరి వారంలో వినుకొండలో జరిగే అండర్ 14 విభాగంలో బి.హంసిక ప్రాతినిథ్యం వహించనుంది. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం రవి,సర్పంచ్ రాజు, పీఎంసీ చైర్మన్ రాముడు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరికి శిక్షణనిచ్చిన పీడీ శ్రీనివాసరావును అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.



లింగారావుపాలెం హైస్కూలులో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎరువుల కొరత లేదు

శావల్యాపురం: మండలంలోని రైతుసేవా కేంద్రాలు సొసైటీల్లో ఎరువులు కొరత లేదని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు వెల్లడించారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో డీఏపీ, యూరియా ఎరువులు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని 11 రైతుసేవా కేంద్రాలు కారుమంచి, శావల్యాపురం సొసైటీల్లో యూరియా, డీఏపీ ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రైతులు వదంతులు నమ్మవద్దని, ఒక్కో రైతుకు 5 సంచుల చొప్పున యూరియా, డీఏపీ ఎరువులు ఇస్తామన్నారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఎరువులు నిల్వ అయిపోగానే రోజుల వ్యవధిలో ప్రభుత్వానికి ఇండెంట్ చేయగానే తక్షణమే సరఫరా చేస్తుందన్నారు. ఎరువులు ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మరాదన్నారు. వ్యాపారస్తులు ఫిర్యాదులకు తావులేకుండా రైతులకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, వీఏఏ వెంకాయమ్మ రైతులు పాల్గొన్నారు.



ఎరువులను రైతులకు అందజేస్తున్న రామారావు

3 నుంచి వాసవీ మాత ఉత్సవాలు

మాచర్ల: ఈనెల 3 నుంచి 12 వరకు పాత మాచర్లలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు భవన శ్రీవెంకటేశ్వర్లు, కార్యవర్గం సోమవారం తెలిపింది. ఈసందర్భంగా ముందుగా అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 3 నుంచి ఉత్సవాలకు సంబంధించిన వివరాలు, నవరాత్రుల సందర్భంగా వివిధ అవతారాల్లో దర్శనమిచ్చే వివరాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.